
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

బుధవారం 15 అక్టోబరు 2025

జిల్లాల వార్తలు

కేసీఆర్ అధికారంలో ఉంటే
మల్లన్నసాగర్ రూపురేఖలు మారేవి
మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి 7

అడవిలో ఇసుక దొంగలు
పుల్‌కల్ మండలంలో జోరుగా అక్రమ రవాణా

1.52 లక్షల పశువులు.. 1.50 లక్షల డోసులు

మెదక్ జిల్లాలో నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

● 42 ప్రత్యేక బృందాలు, పర్యవేక్షణకు ముగ్గురు అధికారులు ● వచ్చే నెల 14 వరకు కార్యక్రమం



మెదక్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసేందుకు మెదక్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి నవంబరు 14 వరకు సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఉచితంగా టీకాలు వేయనున్నారు. ఇందుకోసం జిల్లాలోని పశువైద్య సిబ్బందితో 42 బృందాలు ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు ముగ్గురు అధికారులను నియమించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,52,524 పశువులు ఉన్నాయి. వీటి కోసం 1.50 లక్షల టీకా డోసులు సిద్ధం చేశారు. టీకాలు వేసిన పశువులకు గుర్తుగా రంగు వేయనున్నారు. ఉదయం సమయంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని సిబ్బంది చేపట్టనున్నారు.

నెల రోజుల కార్యక్రమానికి ప్రణాళిక



అన్ని రకాలు పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణకు నేటి నుంచి వచ్చే నెల 14 వరకు నెల పాటు టీకా కార్యక్రమం కొనసాగుతోంది. గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు తీవ్ర జ్వరం వస్తుంది. కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. నోటిలో పుండ్లు ఏర్పడి పశువులు మేత మేయక నీరసిస్తాయి. పాడి పశువుల్లో పాల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. జిల్లాలోని పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటయ్య

సంగారెడ్డి ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవంలో పాల్గొన్న జగ్గారెడ్డి



ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఖవ్వాలిని తిలకిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ సమీపంలోని హజ్‌రత్ మౌలానా అల్ హజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఉమర్ అల్ మారూఫ్ హబీబ్ ఇర్ఫాన్ అలీ షా బంద నవాజ్ (ఇర్ఫానీ దర్గా) 23వ ఉర్సు ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఉర్సు ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన ఖవ్వాలిని జగ్గారెడ్డి ఆస్వాదించారు. అనంతరం ఖవ్వాలి బృందానికి తోఫా ఇచ్చారు. జగ్గారెడ్డికి దర్గా పీఠాధిపతి హజ్‌రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీమ్ భార్గా ఇర్ఫానీ సాదర స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దర్గాలో ప్రార్థనలు చేశానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హఫీజ్ షేక్ షఫీ, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఖవ్వాలి బృందానికి తోఫా ఇస్తున్న జగ్గారెడ్డి

దగ్గు మందు..

దుకాణాల్లో ముందు..

ఇప్పటికే గ్రామస్థాయికి సరఫరా చేసిన డిస్ట్రిబ్యూటర్లు

జిల్లా వ్యాప్తంగా విస్తరించిన జనరిక్ మందులషాపులు

నిషేధిత జాబితాలో స్మార్ట్ ల్యాబ్‌కు చెందిన రెస్పిఫ్రెష్ సిరప్



మెదక్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాల్లో ఓ కంపెనీ దగ్గు మందు సేవించి చిన్నారులు మృతిచెందడంతో తెలంగాణా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అప్రమత్తమైంది. కిడ్నీ వైఫల్యానికి కారణమయ్యే ప్రమాదమున్న కోల్డ్‌రిఫ్ ఎస్ ఆర్-13 బ్యాచ్ సిరప్‌ను వినియోగించవద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు రాష్ట్రంలో రెలీలైఫ్ సీఎఫ్, రెస్పీఫ్రెష్- టీఆర్ సిరప్‌లు వాడొద్దని ప్రకటించింది.

యథేచ్ఛగా అమ్మకాలు

మెదక్ జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీలు రెస్పీ ఫ్రెష్ టీఆర్ సిరప్‌లను రోగులకు విరివిగా సిఫారసు చేస్తూ ఉంటారు. జనరిక్ మందుల షాపుల్లో ఇటీవల వరకూ అందుబాటులో ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం నిషేధించే లోపే క్షేత్ర స్థాయిలో రెస్పిఫ్రెష్-టీఆర్ సిరప్ సరఫరా జరిగిపోయినట్లు సమాచారం. తక్కువ ధరకు అందుబాటులో ఉండడంతో గ్రామీణ వైద్యులు ముఖ్యంగా ఆర్ఎంపీ, పీఎంపీలు వీటిని పేద రోగులకు సిఫారసు చేస్తూంటారు. దగ్గు తగించడంలో వేగంగా పనిచేస్తుందనే ప్రచారంతో ఈ మందు మార్కెట్లో వేగంగా విస్తరించింది.

పలు మండలాలకు సరఫరా

జిల్లావ్యాప్తంగా జనరిక్ డ్రగ్స్ డిస్ట్రిబ్యూటర్లు ఉండడంతో నిషేధం నేపథ్యంలో ఇప్పటికే పలు మండలాల్లో డీలర్లు స్టాక్‌క్లియర్ చేయాలన్న ఆత్రుతతో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోనే ఐదు జనరిక్ డిస్ట్రిబ్యూటర్ ఏజెన్సీలు ఉన్నాయి. నర్సాపూర్‌లో 4, చేగుంటలో 1, పెద్దశంకరంపేటలో 1 ఏజెన్సీలున్నాయి. వీటి నుంచి మెదక్, రామాయంపేట, హవేలీఘనపూర్, టేక్మాల్, పాపన్నపేట, కౌడిపల్లి, కొల్చారం, నారాయణ్‌ఖేడ్, చేగుంట, తూప్రాన్, మాసాయిపేటతో పాటు కామారెడ్డి జిల్లా సరిహద్దులోని ఎల్లారెడ్డి, గోపాల్ పేట్ లలో సాధారణంగా నిత్యం జనరిక్ మందులు పంపిణీ చేస్తుంటారు. ప్రస్తుతం నిషేధిత రెస్పిఫ్రెష్- టీఆర్ సిరప్ కూడా ఇప్పటికే ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు చేరి ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు పట్టణాలు, గ్రామాలకు స్టాక్ తరలించి ఉంటారని అనుకుంటున్నారు. స్టాక్ మిగిలిపోతే నష్టపోతమనే భయంతో డిస్కౌంట్‌తో పంపిణీ చేసే అవకాశం ఉందని ఓ మెడికల్ రిప్రజెంటేటివ్ తెలిపారు. డ్రగ్ కంట్రోల్ విభాగం తక్షణ చర్యలు తీసుకోకపోతే పేద ప్రజలు ప్రమాదకర మందుల బారిన పడే అవకాశం ఉంది. ప్రమాదకరమని తెలిసినా ఇలాంటి మందులను మార్కెటింగ్ చేస్తూ ప్రిస్రైబ్ చేస్తుండడం శోచనీయం.

ఆ బ్యాచ్‌ను నిషేధించాం

ఇటీవల పలు రాష్ట్రాల్లో పిల్లలకు దగ్గు మందు వికటించి మరణాలు చోటు చేసుకుండడంతో రాష్ట్రంలో రెస్పిఫ్రెష్-టీఆర్ సిరప్ ఎ బ్యాచ్ అమ్మకాలను ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వం పేర్కొన్న బ్యాచ్‌లో స్టాక్‌ను తిరిగి కంపెనీకి పంపించాల్సిందిగా మందులషాపుల నిర్వాహకులను ఆదేశించాం. కానీ, ఇప్పటి వరకు తనిఖీలు చేపట్టలేదు.

-చంద్రకళ, జిల్లా ఔషధ నియంత్రణాధికారి, మెదక్

వీధి కుక్కలకు

కు.ని. ఆపరేషన్లు

లోకాయుక్తకు డీపీవో వివరణ

మెదక్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా శివంపేటలో గత జూలై 19 కుక్కకాటుకు గురై నితిన్ అనే బాలుడు మృతి చెందిన ఘటనపై లోకాయుక్తతో పాటు మానవహక్కుల కమిషన్ జిల్లా అధికారులను వివరణ కోరింది. బాలుడి మరణంపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలతో ఈ కేసును లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించాల్సిందిగా ఆదేశించింది. దీంతో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య లోకాయుక్తకు వివరణ పంపించారు. జిల్లాలోని వీధి కుక్కలకు స్టెరిలైజేషన్(కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు) చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలోని శునకాలను పట్టుకుని జిల్లా కేంద్రంలోని ఎనిమల్ బర్త్‌కంట్రోల్ సెంటర్‌లో ఈ ఆపరేషన్లు చేయాలని, ఒక్కో ఆపరేషన్‌కు రూ.1,650 చొప్పున పంచాయతీలే చెల్లించాలని సూచించినట్లు వివరించారు. అలాగే, చికెన్ షాపులు, పౌల్ట్రీ ఫారాలలో మాంసం వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, రహదారుల పక్కన పడేయరాదని, వాటిని దూరంగా గొయ్యి తీసి పాతిపెట్టాలని నోటీసులు ఇచ్చినట్లు వివరించారు. ఈ నిబంధనలు పాటించని యాజమాన్యాలకు రూ. 10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. ఇకపై ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నట్లు లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు.

కారు అద్దాలు పగులగొట్టి
రూ. 20 లక్షలు చోరీ
సంగారెడ్డిలో ఓ దాబా వద్ద ఘటన 7



సింగూరు ప్రాజెక్టు

సింగూరు.. వరద జోరు

ప్రాజెక్టు చరిత్రలోనే రికార్డు

ఈ సీజన్‌లో 243 టీఎంసీల నీరు దిగువకు విడుదల

ఇప్పటికీ తెరిచే ఉన్న గేట్లు

60 రోజుల పాటు వరదలోనే ఏడుపాయల దుర్గమ్మ ఆలయం

సంగారెడ్డి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇటీవల కురిసిన వర్షాలకు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు నీటి ప్రాజెక్టు రికార్డులు నమోదు చేసింది. ప్రాజెక్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. మంజీరా నదిపై 1989లో నిర్మించిన ఈ రిజర్వాయర్ సామర్థ్యం 30 టీఎంసీలు. హైదరాబాద్‌కు తాగు నీటిని అందించడంతో పాటు ఆయకట్టు భూములకు సాగునీటికి ఉపయోగపడేలా దీనిని నిర్మించారు. దాదాపు 35 ఏళ్లుగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు నిరంతరం మంజీరా నీటి సరఫరాలో ఈ రిజర్వాయర్ కీలకంగా మారింది. మిషన్ భగీరథతో ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకూ ఈ నీటిని వినియోగిస్తున్నారు.

భయపెట్టిన ప్రవాహం!

సింగూరు రిజర్వాయర్ ఆనకట్టకు బుంగపడడంతో గత రెండేళ్లుగా తాత్కాలిక చర్యలు చేపట్టారు. కంకర చిప్స్ బస్తాలను అడ్డుగా వేసి ఆనకట్టను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. గత మే నెలలో జాతీయ ప్రాజెక్టు భద్రత మండలి

మిగతా 8లో..

ఇంకా కొనసాగుతున్న వరద

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ మాత ఆలయం మంజీరా నది పక్కనే ఉంటుంది. మంజీరాకు భారీగా వరద వస్తే ఈ ఆలయ పరిసరాలు ముంపునకు గురవుతాయి. ప్రతీ వర్షాకాలంలో వారం నుంచి 10 రోజుల పాటు గుడిని మూసివేస్తారు. ఈసారి రికార్డు స్థాయిలో దాదాపు 60 రోజుల పాటు ఆలయాన్ని మూసే ఉంచారు. వరద తాకిడి గర్భగుడిలోకి భారీగా నీరు చేరింది. లడ్డూ ప్రసాదం కౌంటర్, ఆలయ షెడ్డు వరదకు కొట్టుకుపోయాయి. పటిష్టమైన రెయిలింగులు సైతం తునాతునకలయ్యాయి. ప్రస్తుతం మరమ్మతులు చేస్తున్నారు. ఇంకా వరద ప్రవాహం కొనసాగుతోంది. కరోనా సమయంలో తప్ప ఆలయ చరిత్రలో వరుసగా 2 నెలల పాటు మూసివేసిన సందర్భం లేదని స్థానికులు చెబుతున్నారు.

ఏడుపాయల ఆలయం వద్ద వరద పరిస్థితి



'సదరం' లోపాలపై కలెక్టర్ అసంతృప్తి

సంగారెడ్డి జీజీహెచ్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

రూ.10 లక్షల నిధులున్నా ప్రత్యేక ఏర్పాట్లు చేయరా?

వారం క్రితమే చెప్పినా నిర్వహణ ఇలాగేనా?

డీఆర్‌డీఏ, ఆస్పత్రి అధికారులపై కలెక్టర్ మండిపాటు

యూడీఐడీ కార్డుల అప్‌లోడ్ పెండింగ్‌పై అసహనం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సదరం క్యాంపు నిర్వహణలో లోపాలపై సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. 'గాడితప్పుతున్న సదరం' శీర్షికతో ఈ నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఈమేరకు మంగళవారం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కొనసాగుతున్న సదరం క్యాంపును ఆమె ఆకస్మికంగా సందర్శించారు. సదరం క్యాంపు నిర్వహణలో భాగంగా ఆర్థో, న్యూరో, ఈఎన్‌టీ, సైక్యాట్రిక్ విభాగాలను తనిఖీ చేసి దివ్యాంగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనరల్ ఓపీ, సదరం క్యాంపు ఒకేచోట నిర్వహించడం వల్ల దివ్యాంగులు ఇబ్బందులను కలెక్టర్ గుర్తించారు. రూ.10 లక్షల నిధులు ఉన్నా ప్రత్యేక ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటుచేసి సదరం క్యాంపు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లోటుపాట్లు లేకుండా క్యాంపు నిర్వహించాలని వారం క్రితం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశించినా చెప్పినా ఈ లోపాలేంటని డీఆర్‌డీఏ, ఆస్పత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూడీఐడీ కార్డుల నమోదు పెండింగ్‌లో ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. క్లినికల్ సైకాలజీ పోస్టుతో పాటు కావాల్సిన ఎక్విప్‌మెంట్ కోసం ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించాఆరు. ఏకో ఫ్రెండ్లీ విధానంలో క్యాంపులు నిర్వహించాలని, డాక్టర్లందరూ అందుబాటులో ఉండాలని, దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో జ్యోతి, డీడబ్ల్యూవో లలితకుమారి, డీఎంహెచ్‌వో నాగనిర్మల, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఆర్ఎంవోలు వీరాంజనేయులు, రవికుమార్ ఉన్నారు.



జీజీహెచ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రజాస్వామ్య పద్ధతిలో డీసీసీ ఎన్నిక

జిల్లా బాస్ నియామకంలో కార్యకర్తల అభిప్రాయానికి ప్రాధాన్యం

సంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ జరిట లైత్‌ఫ్లాంగ్

నారాయణఖేడ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యకర్తల అభిప్రాయం మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నామని ఏఐసీసీ అబ్జర్వర్ జరిట లైత్‌ఫ్లాంగ్ పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నికపై అభిప్రాయాలు సేకరించేందుకు నారాయణఖేడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావుతో కలిసి పాల్గొన్నారు. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ప్రజాస్వామిక విలువలకు పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. అందుకే జిల్లాలో పార్టీని నడిపించే నాయకుడి ఎన్నిక కోసం కార్యక్రకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయగలిగేవారినే డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తామని తెలిపారు. ఇందుకోం నియోజకవర్గాలవారీగా సమావేశాలను నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన చక్కగా కొనసాగుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక ప్రజా హితమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజాపాలన ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నందున కార్యకర్తలు పార్టీ బలపర్చిన వారిని గెలిపించడం కోసం సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, శ్రీనివాస్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రషీద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సర్దార్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముంతాజ్, తదితరులు ఉన్నారు.



నారాయణఖేడ్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్ జరిట

సైబర్ నేరాలపై నిఘా : సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా పెట్టామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఆన్‌లైన్ ఫ్రెండ్‌యాప్ ద్వారా పరిచయం చేసుకుని డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నిందితులను సంగారెడ్డి జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.3.63 లక్షల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ వెల్లడించారు. హత్నూర మండలానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థికి డక్‌చాట్ క్లబ్ యాప్ అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా అమ్మాయిగా నకిలీ ప్రొఫైల్‌తో సైబర్ నేరగాడు పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో మోసం చేస్తూ జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో బాధితుడి నుంచి రూ.10.33 లక్షలు యూపీఐ ద్వారా బదిలీ చేయించుకున్నాడు. మోసపోయానని గుర్తించిన బాధితుడు ఆగస్టు 1న సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీఎస్ పోలీసులు విచారణ ప్రారంభించారు. నిందితుడైన ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన విద్యార్థి సీలం సంజయ్‌కుమార్ (19)ను అరెస్ట్ చేశారు. మరో నిందితుడు గడ్డం ప్రకాశ్ (19) పరారీలో ఉన్నాడు. ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులతో స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. ధన లావాదేవీలు చేయడం, నమ్మకం ఉంచడం వంటివి చేయరాదన్నారు.



దొంగల కోసం సీసీ కెమెరాల జల్లెడ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఎంసీహెచ్ ఆస్పత్రిలో దొంగలను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. 'దవాఖానాకు వస్తే జేబులు గుల్ల' అనే శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఆస్పత్రిలో పేషెంట్‌లతో పాట సహాయకుల సెల్‌ఫోన్లు, బైక్, నగదు చోరీ చేసిన దొంగలను గుర్తించేందుకు సీసీ కెమెరాలను జల్లెడపడుతున్నారు. అనుమానితుల ఫొటోలను గుర్తించి దొంగలను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'ఏకీకృతం'పై కదిలిన కలెక్టర్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

వివరణ ఇవ్వాలని మున్సిపల్ ఇంజనీర్లకు ఆదేశం.. కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెదక్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెదక్, నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు నిలిచిపోవడంపై ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఏకీకృతం ఇంకెన్నాళ్లకు?' కథనానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించారు. మున్సిపల్ అధికారులను వివరణ కోరారు. పనులు అర్థాంతరంగా నిలిచిపోవడానికి కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో కాంట్రాక్టర్‌కు మున్సిపల్ ఇంజనీర్లు నోటీసులు జారీ చేస్తున్నట్లు మెదక్ మున్సిపల్ డీఈ మహేష్ తెలిపారు. ఆగిపోయిన నిర్మాణపు పనులు తిరిగి ప్రారంభించి మార్కెట్లు అందుబాటులోకి తీసుకువచ్చేందు చర్యలు చేపడుతున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

పటాన్‌చెరు/చేగుంట/నర్సాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. నర్సాపూర్ మండలం రుస్తుంపేటకు చెందిన మేస్త్రీ పని చేసే దుర్గయ్య అనే వ్యక్తి అదృశ్యమైయ్యాడు. మంగళవారం సాయంత్రం ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గయ్య అతడి భార్య సుజాత దంపతులు ఈ నెల 12వ తేదీన నర్సాపూర్‌లో పెళ్లికి హాజరై తిరిగి గ్రామానికి వెళ్లి భార్యను వదిలి బయట పని ఉందని వెళ్లాడు. అతడు ఎంతకు రాకపోవడంతో చుట్టు పక్కల వెతకడమే కాకుండా గ్రామాలలో కూడా వెతికినా ఫలితం లేదు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


దుర్గయ్య(ఫైల్)

చేగుంటలో ఒకరు

మరో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండల పరిధిలోని పొలంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్ సోమవారం రాత్రి 7 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు ప్రవీణ్ బ్లాక్ కలర్ టీ షర్ట్, నీలిరంగు జీన్ ప్యాంటు, ధరించి ఉన్నాడు. భార్య ఎరుకల కావేరి చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు తో చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ఎరుకల ప్రవీణ్ (ఫైల్)

పటాన్‌చెరులో మరొకరు

డ్యూటీకి వెళ్లిన ఓ యువతి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హిమబిందు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీలో ఉంటున్న మధుకుమారి చందానగర్‌లో మంగళాయం అనే వస్త్ర దుకాణంలో పని చేస్తుంది. సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లి ఇంటికి రాలేదు. రాత్రి సమయంలో చుట్టుపక్కల విచారణ చేశారు. ఫలితం లేకపోవడంతో మంగళవారం అక్క సోనికుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


మధుకుమారి (ఫైల్)

గంజాయి జాడ కోసం డ్రోన్‌తో జల్లెడ

నారాయణఖేడ్/కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి);సిర్గాపూర్ మండల పరిధిలోని గిరిజన తండాల శివారులోని కంది, పత్తి చేలల్లో గంజాయి జాడ కోసం మంగళవారం పోలీసులు డ్రోన్ కెమెరాతో జల్లెడ పట్టారు. రెండు రోజుల క్రితం నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తాండా శివారులో గంజాయి మొక్కలు పట్టుబడిన నేపథ్యంలో కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సిర్గాపూర్ మండల పరిధిలోని పటేల్, గైరాన్ గిరిజన తాండాల శివారులోని పత్తి, కంది పంటల్లో గంజాయి మొక్కల కోసం డ్రోన్‌తో జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా కంగ్టి సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులు తమ పంట పొలాల్లో గంజాయిని అంతరపంటగా సాగు చేసినట్లు తేలితే, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించారు. ఎలాంటి ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండదని, ప్రస్తుత నూతన చట్టాల ప్రకారం కఠిన శిక్షకు బాధ్యులవుతారని సీఐ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సిర్గాపూర్ ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో

గంజాయిని సాగు చేసిన, విక్రయించిన, రవాణ చేసిన నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీవెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నారాయణఖేడ్ ప్రాంతంలోని వ్యవసాయ పొలాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి సాగు , రవాణ సమాచారాన్ని వెంటనే నారాయణఖేడ్ ఎస్ఐ శ్రీశైలం నెంబరు 8712656757, నారాయణఖేడ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి 8712656733, తన నెంబరు 8712656709కు సమాచారం అందించాలన్నారు. తమకు సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.


సిర్గాపూర్ మండలం పటేల్ తండా శివారులోని కంది, పత్తి పొలాల్లో డ్రోన్ గాలింపు చర్యలను పరిశీలిస్తున్న కంగ్టి సీఐ, సిర్గాపూర్ ఎస్సై



నిరుపయోగంగా పశువుల హాస్టల్

- కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం
- చోరీకి గురతున్న విలువైన సామాగ్రి
- పట్టించుకోని అధికారులు,నాయకులు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని లక్ష్యంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, సూడా మాజీ చైర్మన్ మారెడ్డిలు ఏర్పాటు చేసిన పశువుల హాస్టల్ నిరుపయోగంగా మారింది. ఎక్కడైనా మనుషులకు హాస్టల్ ఉంటుంది. కాని సిద్దిపేట రూరల్ మండలంలో పశువులకు ఈజీఎస్, సీఎస్ఆర్ లో సుమారు రూ.2 కోట్ల నిధులతో హాస్టల్‌ను నిర్మాంచారు. సిద్దిపేట పట్టణానికి దగ్గరలో ఉండడంతో ఇర్కోడు గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి పశువుల హాస్టల్ నిర్మించారు. ప్రారంభించిన నుంచి నేటి వరకు వినియోగంలో లేకపోవడంతో పశువుల హాస్టల్‌లో ఉన్న విలువన సామగ్రిని గుర్తుతెలియని దుండగులు గదుల తాళాలలు పగలగొట్టి ఎత్తుకెళ్తున్నారు. పశువుల హాస్టల్‌ను అధికారులు కాని, నాయకులు కాని పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయిందని విమర్శలు వస్తున్నాయి.


ఇర్కోడు పశువుల హాస్టల్‌లో నిర్మించిన పశువుల షెడ్లు

అన్ని రకాల సౌకర్యాలతో నిర్మాణం..

ఇర్కోడు గ్రామంలో వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.1 కోటి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నుంచి రూ.1 కోటి నిధులతో అన్ని రకల సౌకర్యాలతో పశువుల హాస్టల్ నిర్మాంచారు. సుమారు 100 నుంచి 150 వరకు ఆవులు, గేదెలు ఉండే సామార్థ్యంతో షెడ్లు నిర్మాంచారు.

చోరీకి గురవుతున్న విలువైన సామగ్రి..

పశువుల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన విలువైన సీసీ కెమారాలు, మందులు నిల్వ ఉంచే ఫ్రిజ్ వంటి సామాగ్రిని గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడగా పాలకేంద్రం పశువల వైద్య సేవలు అందించే గదులలో మందులు, విలువైన సామగ్రి ధ్వంసం అయింది. పశువులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లు, ఇతర వస్తువులు పాడైపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి పశువుల హాస్టల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాణా ఆవరణలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జోగిపేట రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి వంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోబోయిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల మేరకు జోగిపేట పట్టణానికి చెందిన మహమ్మద్ సలీం తన భార్య విడాకులు ఇచ్చిందని ఆవేదనకులోనై మనస్తాపంతో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. ఈ ఘటనలో తన కుటుంబ సభ్యులు తనపై దాడి చేసారని ఆరోపిస్తూ వంటిపై పెట్రోల్ పోసుకుని జోగిపేట పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసెందుకు వచ్చాడు. అప్పటికే మద్యం తాగి ఉన్న సలీంను ఉదయం రమ్మని పోలీసులు నచ్చ చెప్పే ప్రయత్నం చేసారు. తన ఫిర్యాదును పోలిసులు నిరాకరించారని ఆగ్రహంతో బాధితుడు అక్కడే నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. అక్కడే ఉన్న స్థానికులు మంటలను ఆర్పి సలీంను మందలించారు. బాధితుడికి తీవ్ర గాయాలు కావడంతో జోగిపేట ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

హవేళిఘణపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లింగ్సాన్‌పల్లి తండాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లింగ్సాన్‌పల్లి తండాకు చెందిన బానోత్ మోహన్ భార్య సోని(42) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. కొన్ని రోజులుగా సోని అనారోగ్యంతో బాధపడుతుంది. దీని వల్ల తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని పోస్టుమార్టు కోసం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కొడుకు వినోద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎసై నరేష్ తెలిపారు.

పాముకాటుతో యువకుడు బలి

దౌల్తాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన తిర్మలాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జాలిగామ దయాకర్ (22) తమ పంట పొలంలో పనులు చేసుండగా పాము కాటేయడంతో సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పనికి తగిన జీతమివ్వండి సారూ

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనకు జేఏసీ కార్యచరణ

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రీమెట్రిక్, పోస్టమెట్రిక్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న కాంటినిజెంట్, డైలీవైజ్ వర్కర్స్ నిరవధిక సమ్మె కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3700 మంది వర్కర్స్ కొనసాగుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని నెల రోజులుగా ఆందళోన చేపట్టారు. రోజుకో విధంగా వినూత్న రీతిలో నిరసనలు తెలియజేస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

బిక్షాటన చేస్తూ, కళ్లకు గంతలు కట్టుకుని, చెవుల్లో పువ్వులు పెట్టుకుని, పచ్చి గడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలు పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరుతున్నారు. తమ సమస్య పరిష్కరమయ్యేలా చూడాలని వేడుకుంటున్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి సిద్దిపేటకు వచ్చిన సందర్బంగా ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశరావును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎంపీ రఘునందన్ రావు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. అందరు కూడా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హమీలిచ్చారు. కాని ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వర్కర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేస్తున్న వర్కర్స్

ధాన్యం కొనుగోలులో లోటు, పాట్లు లేకుండా చూడాలి

- మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌కు బీజేపీ జిల్లా శాఖ వినతి

మెదక్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. కొనుగోలును సకాలంలో ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తూకం వేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందు అవసరమయ్యే లారీలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో అక్రమాలకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతు ఖాతాలో నగదును జమ చేయాలన్నారు.ధాన్యం బస్తాలు, కూలీల కొరత లేకుండా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శలు రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


మెదక్ అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్





యువకుడి ఆత్మహత్య కేసులో మరో ఇద్దరు అరెస్టు

- క్యూనెట్ కేసులో మొత్తం నలుగురు అరెస్టు

వర్గల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మల్టీలేవల్ మార్కెటింగ్ సంస్థలో పెట్టుబడి పెట్టి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం మరో ఇద్దరిని పోలీసులు అరేస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సంఘటనకు సంబంధించి గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన బడుగు హరికృష్ణ (26) అనే యువకుడు మల్టీ లేవల్ చైన్ సంస్థ మోసానికి అప్పులపాలై ఈ నెల ఈ నెల 9వ తేదిన సూసైడ్ నోటు రాసి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి ఈ నెల 13వ తేదీన మణికంఠరెడ్డి, అలేఖ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మంగళవారం మరో ఇద్దరు నిందితులగు హైదరాబాద్ సరూర్ నగర్‌కు చెందిన కంకణాలపల్లి దివ్య, ఖమ్మం జిల్లా కేంద్రం రాపర్తి నగర్‌కు చెందిన అనుమోలు భాను ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



కొమురవెల్లి గడ్డ.. సీతాఫలాల అడ్డా



కమాన్ వద్ద జోరుగా క్రయవిక్రయాలు

ఇక్కడి నుంచే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



కొమురవెల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా అడవులు, గుట్టల్లో సహజసిద్ధంగా లభించే సీతాఫలాలకు కొమురవెల్లి ప్రసిద్ధి చెందింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో తెలంగాణలో ఈ పండ్లు విరివిగా లభిస్తాయి. ప్రస్తుతం కొమురవెల్లి కమాన్ వద్ద జోరుగా క్రయవిక్రయాలు సాగుతున్నాయి. కొమురవెల్లి, కొండపాక, కుకునూర్‌పల్లి, తొగుట, జగదేవ్‌పూర్, గిరాయిపల్లి వంటి ప్రాంతాల అడవులలోని చెట్ల నుంచి సీతాఫలాలను తెంపి, వాటిని ద్విచక్ర వాహనాలపై కొమురవెల్లి కమాన్ వద్దకు తీసుకువచ్చి రాజీవ్ రహదారిపై విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. ఒక్కో ప్లాస్టిక్ ట్రే బాక్స్‌ను రూ.500 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడికి తీసుకువచ్చిన పండ్లను కొందరు పండ్ల వ్యాపారులు కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఉపాధి కోసం పలువురు విక్రయదారులు ఇక్కడికి సీతాఫలాలను తీసుకువస్తుండటంతో, ఉదయం పూట కొమురవెల్లి కమాన్ వద్ద సీతాఫలాల క్రయవిక్రయాలు జాతరలా జరుగుతున్నాయి.



మురుగు నీటిని తొలగించిన అధికారులు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



చెట్లగౌరారం గ్రామ శివారులో మురుగు కాలువను తీస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మనోహరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్న విషయంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చుట్టూ చెట్లగౌరారం గ్రామం డ్రైనేజీ నీరు చేరుతోంది. దీంతో పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు ఉన్నాయంటూ మంగళవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'బడి చుట్టూ మురుగు నీరు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై మండల సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి స్పందించి రంగాయపల్లి పాఠశాలను పరిశీలించారు. అనంతరం రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడి మురుగు కాలువను జేసీబీతో తవ్వించి, నీటిని తొలగించారు. దీంతో రెండు గ్రామాల మురుగు నీటి సమస్య తీరిపోయింది.

బీబీపేట జంలాతండా న్యాయవాదికి డాక్టరేట్



ఢిల్లీలో డాక్టరేట్ స్వీకరిస్తున్న దేవిదాస్ నాయక్

కల్హేర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడంలో విశేష కృషి చేస్తున్న డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది దేవిదాస్ నాయక్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. భారత ప్రభుత్వ ఆధీనంలోని ఈ సంస్థ అందించే ఈ డాక్టరేట్‌ను సోమవారం న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ భవన ఆవరణలో అందుకున్నారు. ముఖ్య అతిథులు జార్ఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ కర్పగ వినాయగం, పార్లమెంటు సభ్యుడు ప్రవీణ్ ఖండేల్‌వాల్, అడిషనల్ సెషన్స్ జడ్జి అపర్ణ స్వామిలు డాక్టరేట్‌ను దేవిదాస్ నాయక్‌కు ప్రదానం చేశారు. సంగారెడ్డి జిల్లా కోర్టులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటూ పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు కృషి చేస్తున్న దేవిదాస్ నాయక్‌కు ఢిల్లీలో డాక్టరేట్ దక్కడం విశేషం. మారుమూల గిరిజన తాండాకు చెందిన దేవిదాస్ నాయక్‌కు డాక్టరేట్ దక్కడంపై ఆయన సొంతతండా, కల్హేర్ మండలంలోని బీబీపేట జంలా తాండాకు చెందిన గిరిజనులు, కల్హేర్ మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందించారు.

సుల్తానాపూర్ జేఎన్టీయూ ప్రిన్సిపాల్ బదిలీ

● కొత్త ప్రిన్సిపాల్‌గా విశ్వనాథరాజు



బదిలీ అయిన జేఎన్టీయూ ప్రిన్సిపాల్ నరసింహ

పుల్‌కల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ గుగులోత నరసింహ బదిలీ అయ్యారు. కొత్త ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తానాపూర్ జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహను జగిత్యాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. దీంతో పాటు, అదే కళాశాలలో సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్వేతను సుల్తానాపూర్ కళాశాల సీఎస్ఈ విభాగానికి బదిలీ చేశారు. జూన్ 2022 నుంచి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నరసింహ దాదాపు మూడేళ్ల పాటు ఇక్కడ పనిచేశారు. కళాశాల అభివృద్ధికి ఆయన కృషి చేశారు. కళాశాలలో ఎంటెక్, బీటెక్‌లలో కొత్త కోర్సులు మంజూరు చేయించడంలో విశేషంగా కృషి చేశారు. బీటెక్‌లో ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఈఈఈ, సీఎస్ఈ అదనపు సెక్షన్, ఎంటెక్ కోర్సుల్లో ఏఐడీఎస్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, వీఎల్ఎస్ఐ, రోబోటిక్స్ ఏఐ కోర్సులు వచ్చేలా పాటుపడ్డారు. వివాదాస్పదంగా మారిన కళాశాల ప్రహరీ గోడ స్థలం కళాశాలకు దక్కేలా చొరవ తీసుకున్నారు. ప్రిన్సిపాల్ నరసింహ ఆకస్మికంగా బదిలీ కావడం పట్ల బోధన, బోధనేతర సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కారు అద్దాలు పగులగొట్టి రూ. 20 లక్షలు చోరీ



సంగారెడ్డి క్రైం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం సినీఫక్కీలో చోరీ జరిగింది. పట్టపగలు కారు అద్దాలు పగులగొట్టి అందులో నుంచి రూ. 20 లక్షల నగదును అపహరించుకుపోయారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నగరానికి చెందిన ముజఫర్ సంగారెడ్డిలో భూమి రిజిస్ట్రేషన్ కోసం మంగళవారం రూ.20 లక్షల నగదు తన ఇన్నోవా వాహనంలో తీసుకువచ్చాడు. సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్ వద్ద వాహనం పార్క్ చేసి పక్క దుకాణానికి వెళ్లాడు. అంతలోనే గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కారు అద్దాలను పగులగొట్టి అందులోని రూ.20 లక్షల నగదును అపహరించారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు నిందితులు ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, విషయం తెలుసుకున్న సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు జరిపారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ సత్తయ్యగౌడ్ వెల్లడించారు.

పల్లె వనం.. జలదిగ్బంధం

జలదిగ్బంధంలో కంది ప్రకృతి వనం

గ్రామ ప్రజలు సేద తీరేందుకు ఊరూరా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షలు ఖర్చుపెట్టి సకల వసతులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోయింది. కంది గ్రామ పల్లె ప్రకృతి వనం అదే కోవలోకి వస్తున్నది. ఇందులోకి వరద నీరు చేరి నెల రోజులుగా జలదిగ్బంధంలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. దీంతో ఇక్కడున్న తెలంగాణ తల్లి విగ్రహం శిథిలావస్థకు చేరతుండగా, ఆట వస్తువులు తుప్పపట్టి పనికిరాకుండా పోతున్నాయి. ఫలితంగా అధికారుల నిర్లక్ష్యంతో లక్షల్లో ప్రజాధనం వృథా అవుతున్నది.

- నెల రోజులుగా వరదనీటిలోనే..
- కళావిహీనంగా మారిన వైనం
- శిథిలావస్థకు చేరిన తెలంగాణ తల్లి విగ్రహం
- తుప్పుపట్టిన ఆట వస్తువులు
- పట్టించుకోని అధికారులు



కంది పల్లె ప్రకృతి వనంలో నిలిచిన నీరు

కంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కంది గ్రామంలోని పల్లె ప్రకృతి వనం అధికారుల నిర్లక్ష్యంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పటి నుంచి పంచాయతీ అధికారులు పల్లె ప్రకృతి వనాన్ని పట్టించుకోకపోవడంతో, అది నెల రోజులుగా వరద నీటిలోనే మగ్గుతోంది. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఈ వనంలో వేలాది పూల, పండ్ల, ఔషధ మొక్కలు నాటారు. చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, వాకింగ్‌కు అనుకూలంగా సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేశారు. ఇందులోనే ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం నీటిలో ఉండి శిథిలావస్థకు చేరుకుంది. అక్కడున్న ఆట వస్తువులన్నీ దుమ్ము, ధూళీ, చెత్తాచెదారంతో నిండి తుప్పుపట్టాయి. రంగురంగుల పూలు, పచ్చని చెట్లతో ఒకప్పుడు ఆహ్లాదకరంగా ఉన్న పల్లె ప్రకృతి వనం ఇప్పుడు కళావిహీనంగా తయారైంది.



నీటితో శిథిలావస్థకు చేరుతున్న తెలంగాణ తల్లి విగ్రహం

అధికారుల నిర్లక్ష్యం... ప్రజాధనం వృథా

పంచాయతీ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పల్లె ప్రకృతి వనం మొత్తం బురద, చెట్ల ఆకులతో, చెత్తాచెదారంతో నిండిపోయి కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా దుర్భర స్థితికి చేరుకుంది. గత వర్షాకాలంలో నీరు పోవడానికి వనం ప్రధాన గేటు వద్ద తవ్విన కాలువను ఇప్పటికీ పూడ్చకపోవడం గమనార్హం. కంది గ్రామ పంచాయతీ కార్యాలయంలో దాదాపు 30 మంది సిబ్బంది ఉన్నప్పటికీ, పల్లె ప్రకృతి వనాన్ని శుభ్రం చేయించకపోవడం శోచనీయం. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇన్ని లక్షల రూపాయలు వృథాగా ఖర్చుపెట్టి పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేయడం ఎందుకని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోని ప్రజలందరూ పచ్చటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒక పార్కులాగా వాకింగ్ చేస్తూ ఆనందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఊరూరా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఈ వనాలలో అందమైన పూలు, పండ్లు, వివిధ రకాల ఔషధ మొక్కలు, మెత్తని గడ్డి నాటారు. సందర్శన వేళలు కూడా నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే, అధికారుల ఆలనా పాలన లేకపోవడంతో మొక్కలు ఎండిపోవడం, చెట్ల నుంచి రాలిన ఆకులు, చెత్తాచెదారం శుభ్రం చేయకపోవడంతో పల్లె ప్రకృతి వనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో పల్లె వనాల ఏర్పాటు లక్ష్యం నీరుగారిపోయింది.

అవయవ దానంతో అమరుడయ్యాడు

● ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపిన శ్రీకాంత్



ఎం.శ్రీకాంత్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాను చనిపోయి కూడా అవయవదానం చేయడం ద్వారా ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో యువకుడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామానికి చెందిన మదునురోళ్ల శ్రీకాంత్ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. దసరా పండుగకు తన సొంతూరుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ నెల 5వ తేదీన సంగారెడ్డి సమీపంలోని ఫసల్‌వాది వద్ద రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి మంగళవారం మరణించాడు. అయితే తాను చనిపోయినా తన అవయవాలను దానం చేయాలని ముందే తన కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ చెప్పడంతో, ఆయన కోరిక మేరకు ఆరుగురికి శ్రీకాంత్ అవయవాలను దానం చేశారు.

కేసీఆర్ అధికారంలో ఉంటే మల్లన్నసాగర్ రూపురేఖలు మారేవి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



కుకునూరుపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ అధికారంలో ఉంటే మలన్నసాగర్ రూపురేఖలు మరోలా ఉండేవని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోల్ శివార్లో ఉన్న మల్లన్నసాగర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు ఫైండ్ల రాజశేఖర్ రెడ్డి, గ్యాదరి కిషోర్, మంగోల్ మాజీ సర్పంచ్ కిరణ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు కనకయ్య, అనిల్ ఉన్నారు.

ఖైదీలకు అండగా న్యాయశాఖ

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

● కంది సెంట్రల్ జైలులో ఆకస్మిక తనిఖీ

కంది, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయసేవాధికార సంస్థకు న్యాయవాదులు లేరని అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఆమె బుధవారం కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జైలులోని అన్ని బ్లాకులను, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాల, బాత్‌రూమ్‌లతో పాటు జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. జైలులో ఖైదీలకు సరఫరా చేసే భోజనం, వారికి కల్పించే సదుపాయాల గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు అందించే ఆహారాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజనాన్ని ఆమె రుచి చూశారు. వంటశాలలో ఖైదీల కోసం వండే కూరగాయలు, బియ్యం, పప్పుదినుసులను తనిఖీ చేశారు. ఖైదీలకు అందించే రోజువారీ ఆహారంలో నాణ్యతలో లోపం ఉండకూడదని జైలు అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీలతో ఆమె మాట్లాడుతూ.. సమయానికి బెయిల్స్ ములాఖత్‌లు అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు లేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఖైదీలు ఉచిత న్యాయ సేవలు పొందేందుకు వారి తరఫున న్యాయవాదులను నియమిస్తామన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారులు, కోర్టు సిబ్బంది, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో ఇసుక దొంగలు

పుల్‌కల్ మండలంలో జోరుగా అక్రమ రవాణా

- ట్రాక్టర్ ఇసుకకు రూ.8 వేల వరకు వసూలు
- అటవీ సిబ్బందికి ఒక్కో ట్రాక్టర్‌పై రూ.2 వేలు ముడుపులు!
- భారీ వర్షాలకు అడవిలో ఏర్పడిన ఇసుక మేటలే లక్ష్యం
- భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం




అటవీ నుంచి ఇసుకను తరలింపు, బొమ్మారెడ్డిగూడెం తండా సమీపంలో అడవిలోకి వెళ్లేందుకు బాట

పుల్‌కల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పుల్‌కల్ మండలంలో విస్తరించి ఉన్న రిజర్వు ఫారెస్టులో అక్రమ ఇసుక దందా జోరుగా సాగుతోంది. అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పలు గ్రామాల ప్రజలు ధనార్జనే ధ్యేయంగా ఈ అక్రమ వ్యాపారానికి పాల్పడుతున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేల నుంచి రూ.8 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ముదిమాణిక్యం, మినపూర్, కోడూరు, గొంగ్లూరు, ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం, లక్ష్మీసాగర్ గ్రామాల శివారు భూముల్లో దాదాపు మూడు వేల ఎకరాల్లో రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉంది. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు అడవిలో పెద్ద ఎత్తున ఇసుక మేటలు ఏర్పడ్డాయి. చౌటకూర్, మినపూర్ బీట్ పరిధిలోకి వచ్చే ఈ అటవీ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకుని అక్రమార్కులు ఇసుకను దోచుకుపోతున్నారు.

కందకాలు తవ్వుతున్నాం..

ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా అడవి మధ్యలో కాలువలు తవ్వుతున్నాం. ఇప్పటికే అటవీ ప్రాంతం చుట్టూ కందకాలు తవ్వాం. అక్రమంగా ఏర్పాటు చేసిన మట్టి బాటలను మూసి వేయడం, ఉదయం వేళల్లో గస్తీ తిరుగుతూ ఇసుక తరలించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులకు జరిమానా విధించాం. అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లకూడదు.

– డిప్యూటీ రేంజి ఆఫీసర్ వేణుగోపాల్

ముడుపులకు అలవాటు పడిన అధికారులు!

ఇతర ప్రాంతాల నుంచి నాణ్యమైన ఇసుక ధరవేలల్లో పలుకుతున్న తరుణంలో, అడవిలో వరద ప్రవాహంతో సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలను అక్రమార్కులు కాజేస్తున్నారు. ఇసుక వ్యాపారం అడ్డు అదుపు లేకుండా సాగుతున్నా, సంబంధిత అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కృషి చేస్తుంటే, అక్రమార్కుల నుంచి ముడుపులు తీసుకుంటున్న అటవీ సిబ్బంది ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ.2 వేలు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.అటవీ అధికారులే తమ జేబుల్లో ఉన్నారన్న ధైర్యంతో అక్రమార్కులు రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. అడవి నుంచి ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అటవీ శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇసుక వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మద్దూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపారు. మండలంలోని అర్జున్‌పట్ల గ్రామ బ్రిడ్జి వద్ద గల వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన కొలుపుల పరశురాములు, బరుగు రాజశేఖర్‌లు ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● చేర్యాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం అర్జునపట్ల, ఆకునూరు, తాడూరు గ్రామాలనుండి సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

రొమ్ము స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి

రామచంద్రాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళలు రొమ్ము స్క్రీనింగ్ పరీక్షల ద్వారా ముందుగానే క్యాన్సర్‌ను గుర్తిస్తే క్యాన్సర్ బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చని డాక్టర్ ప్రజ్ఞా చిగురుపాటి అన్నారు. మంగళవారం ఏఐజీ హాస్పిటల్స్, యాసీ బ్రెస్ట్ ఫౌండేషన్ సహకారంతో తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్(టెనా), లయన్స్ క్లబ్ సంయుక్తంగా కొల్లూరులోని డబుల్ బెడ్‌రూం సముదాయంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెనా అధ్యక్షుడు రమణ, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

బ్యాంకు, పోస్టాఫీస్ సేవలపై అవగాహన

కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు, పోస్టాఫీసుల్లో జరిగే ఆర్థిక లావాదేవీలు, వివిధ రకాల సేవల గురించి విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన సిర్గాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీలో భాగంగా ఎక్స్‌పోజర్ విజిట్‌కు తీసుకెళ్లినట్లు ఎంఈవో నాగారం శ్రీనివాస్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

నారాయణఖేడ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ మున్సిపల్ 8వ వార్డుకు సంబంధించిన మన్సూర్‌పూర్‌లో పక్షంరోజులుగా తాగునీటి సరఫరా జరగడం లేదని వార్డువాసులు మంగళవారం కమిషనర్ జగ్జీవన్‌ను కలిసి వివరించారు. తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు వార్డును సందర్శించి పరిస్థితులను పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ హామీఇచ్చారు.

పోలియో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నారాయణఖేడ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోలియో చుక్కలు వికటించి మృతిచెందిన కంగ్టి మండలం భీంరా గ్రామానికి చెందిన మూడునెలల బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం సబ్ కలెక్టర్ ఉమాహారతికి, డీఎస్పీ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

హత్యాచార బాధిత కుటుంబానికి పరామర్శ

మెదక్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పరిధిలోని ఓ తండాకు చెందిన మహిళ హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. కాగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆదేశాల మేరకు హత్యాచార బాధిత కుటుంబాన్ని జాగృతి సభ్యురాలు మారేపల్లి మాధవి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.20 లక్షలతో పాటు, సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

బ్రహ్మం సేవలు అభినందనీయం

అల్లాదుర్గం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీఐ హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన కంచరి బ్రహ్మం సేవలు అభినందనీయమని తహసీల్దార్ మల్లయ్య అన్నారు. ఆర్టీఐ దినోత్సవంలో భాగంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ హక్కు చట్టం, వాటి వినియోగంపై తహసీల్దార్ అవగాహన కల్పించారు.

మట్టి అక్రమ తవ్వకాలను నివారించండి

అల్లాదుర్గం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గంలోని సర్వే నంబరు 379లో గల ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా జరుపుతున్న మట్టి తవ్వకాలను నివారించాలని గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. పగలనకా, రేయనకా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుపుతుండడంతో గొయ్యిలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలు

పెద్దశంకరంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో పునఃప్రతిష్ఠాపనలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు పుష్పాదివాసం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. బుధవారం అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపనలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వివరించారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి : రాహుల్‌రాజ్

రామాయంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ లబ్ధిదారులకు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తిచేస్తే బిల్లులు ఖాతాలో జమవుతాయన్నారు. రామాయంపేట మండల పరిధి కోనాపూర్ గ్రామంలో మంగళవారం కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. పంట సేకరణలో అక్రమాలకు తావిచ్చిన క్రిమినల్ కేసులు పెడతామన్నారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించకుండా సద్వినియోగపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులకు కావాల్సిన టార్పాలిన్లు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా సూచించారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.


కోనాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్ర ప్రారంభంలో రాహుల్‌రాజ్

క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు : కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కళాశాల ప్రాంగణంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన క్రీడా మైదానం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మంగళవారం కళాశాలలో కలెక్టర్ పర్యటించారు. ఆర్‌అండ్‌బీ, జిల్లా క్రీడాభివృద్ధి, టీజీఎంఎస్ఐడీసీ, కళాశాల అధికారులతో కలిసి మైదానం ఏర్పాటుకు అవసరమైన స్థలం సర్దుబాటు మార్గాలపై సమీక్షించారు. క్రికెట్ ప్రాక్టీసింగ్ నెట్ కోర్టులు, వాలీబాల్ కోర్టు, త్రోబాల్ కోర్టు, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలకు మల్టీపర్పస్ ప్లే గ్రౌండ్ రూపకల్పన్నారు. డీవైఎస్‌వో ఖాసీంబేగ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సింలు, డీఈఈ రవీందర్, ఏఈఈ శశాంక్, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా.ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.


ప్రభుత్వ మెడికల్ కాలేజీలో క్రీడా మైదానం ఏర్పాటుకు స్థల పరిశీలన మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఇంజనీరింగ్ అధికారులు

క్రీడా కేంద్రంగా పటాన్‌చెరు : మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆటలకు నిలయంగా పటాన్‌చెరు నియోజక కేంద్రాన్ని మారుస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మైత్రిమైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంటు ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. 16 నుంచి పటాన్‌చెరు పట్టణంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయకరెడ్డి పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి : మైనంపల్లి

నిజాంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేయలేని అభివృద్ధిని.. 21 నెలల కాలంలోనే చేసి చూపిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం లీలా గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రారంభించి.. వదిలేసిన రోడ్డు పనులను పూర్తిచేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు కూడా వచ్చేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు అంజనేయులుగౌడ్, డాక్టర్ మోహన్‌నాయక్, వెంకటేష్ గౌడ్, నసీరోద్దీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న హనుంతరావు

కొనుగోలు కేంద్రాల్లో నియమాలు పాటించాలి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నియమాలు పాటించాలని డీఆర్డీవో జ్యోతి సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో వానాకాలం 2025-26 సీజన్‌కు సంబంధించి డీఆర్డీఏ ఆధీనంలోని సిబ్బంది, పీపీసీ, వీవోఏ, ఏపీఎం, సీసీ, ట్యాప్ ఆపరేటర్లకు మంగళవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పీపీసీలో ధాన్యం పోసిన వెంటనే వారి పేరు సీరియల్ బుక్‌లో రిజిస్టర్ చేసి, వారికి సీరియల్ నెంబర్ ఇచ్చి ఎఫ్ఎక్యూ ప్రకారం తేమశాతం రాగానే తూకం వేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర గ్రేడ్-ఎ రూ.2,389, కామన్ గ్రేడ్ రూ.2,369 సన్నధాన్యానికి అదనంగా రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సూర్యారావు, డీపీఎం రమేశ్‌బాబు, ఏపీడీ బాలరాజు, ఏపీడీ పూజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్డీవో జ్యోతి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీపీవో

కంది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీవో (జిల్లా పంచాయతీ అధికారి) సాయిబాబా హెచ్చరించారు. కంది మండలం వడ్డెనగూడతండాలోని అండర్ డ్రైనేజీని, వైకుంఠ ధామం, నర్సరీ, పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, క్రీడా ప్రాంగణాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త వేరుగా సేకరించి ఎరువును తయారు చేయాలని పేర్కొన్నారు. గ్రామం మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణ సజావుగా ఉండాలని సూచించారు. డీపీవో వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి కిరణ్‌యాదవ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.


కంది మండలం వడ్డెనగూడతండాలో అండర్ డ్రైనేజీని పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నర్సాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో హేమభార్గవి, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం నర్సాపూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను సంపూర్ణంగా అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది సుధాకర్, ఎంఈవో తారాసింగ్, న్యాయవాదులు స్వరూపరాణి, మధుశ్రీ, రాజునాయక్, సాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

బీసి రిజర్వేషన్లపై ఐక్య ఉద్యమాలు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్


అభివాదం చేస్తున్న బీసీ సంఘాల జేఏసీ నాయకులు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి రిజర్వేషన్లపై ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ తెలిపారు. బీసీ సంఘాల నాయకులు మంగళవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో సమావేశం నిర్వహించి జేఏసీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 9ను హైకోర్టు స్టే ఇవ్వడం వల్ల బీసీల నోటికాడికి వచ్చిన బువ్వని కొందరు అగ్రకులాల వారు అడ్డుకున్నారని వాపోయారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన చూసుకున్నా 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం సబబేనన్నారు. రిజర్వేషన్లను సాధించేందుకు బీసీ సంఘాలన్నీ ఏకమై మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కృష్ణ, సురేందర్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ పాటిల్, సలహాదారుడు చంద్రయ్య స్వామి, సంగమేశ్వర్, శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో చోరీ

చిన్నశంకరంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పశు వైద్యాధికారి డాక్టర్ గీతమాలిక వివరాల ప్రకారం.. ఆస్పత్రి గది తాళం ధ్వంసం చేసి వాటర్ పంప్, తదితర పనిముట్లు, సామగ్రిని దొంగిలించినట్లు ఆమె తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సరాఫ్‌పల్లిలో బైక్ చోరీ

పుల్‌కల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి బైక్ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన మన్నె సుధాకర్ (ఏపీ 23 ఏడీ 0120) నంబరు గల హోండా షైన్ బైక్‌ను ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బైక్‌ను ఎత్తుకువెళ్లారు. ఉదయం లేచి చూడగానే, అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో రికార్డైంది. ఈ మేరకు బాధితుడు మన్నె సుధాకర్ పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంఘటితంతోనే సమస్యలు పరిష్కారం

జహీరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సంఘటితమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయని వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు నర్సింలు పేర్కొన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్‌హాల్‌లో జహీరాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో సభ్యుల, నాయకుల సహకారంతో వివిధరకాల సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ నెల 16న జహీరాబాద్ నియోజకవర్గ లింగాయత్‌సమాజ్ కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, సుభాష్, ఆగూరీ శివరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పని ప్రదేశంగా ఎపిటోరియా పరిశ్రమ

జిన్నారం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ పని ప్రదేశంగా గడ్డపోతారంలోని ఎపిటోరియా పరిశ్రమ గుర్తింపు పొందింది. పరిశ్రమలో కార్మికులు, యాజమాన్యం మధ్య సానుకూల వాతావరణం, అనుకూల పని విధానం తదితర అంశాలపై జీపీటీడబ్ల్యూ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఎపిటోరియా పరిశ్రమకు మొదటి స్థానం లభించినట్లు పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. మంగళవారం కార్మికులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో యాజమాన్యం కార్మికులను అభినందించింది. ఈ కార్యక్రమంలో పరిశ్రమ జీఎం శ్రీధర్ సూరత్, హెచ్ఆర్ హెడ్ మూర్తి, అడ్మిన్ శంకర్‌ప్రసాద్ పాల్గొన్నారు.


పరిశ్రమ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులు, పరిశ్రమ ప్రతినిధులు

సింగూరు.. వరద జోరు

(5వ పేజీ తరువాయి)

సభ్యులు ఈ ప్రాజెక్టు పరిస్థితిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 టీఎంసీలు నిల్వచేస్తే ప్రాజెక్టుకు ప్రమాదం తప్పదని హెచ్చరించారు. అందుకే 17 టీఎంసీల్లోపే నిల్వ చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రాజెక్టులోకి భారీగా వరద చేరడంతో అధికారులకు వణుకు పుట్టింది. ఒక్కోరోజు లక్ష క్యూసెక్కుల చొప్పున నీటి ప్రవాహం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఎట్టకేలకు వరద తగ్గడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆగస్టు నుంచి ఇప్పటిదాకా గేట్లు తెరిచే ఉన్నాయి. ఈ ఒక్క సీజన్‌లోనే సింగూరు రిజర్వాయర్ నుంచి 243 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు.

లాటరీ ద్వారా టపాకాయల దుకాణాలు

నారాయణఖేడ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని తహసీల్ మైదానంలో టపాకాయల దుకాణాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులకు మంగళవారం లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించారు. దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి దాదాపు 24 మంది వ్యాపారులు దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో తహసీల్ కార్యాలయం నుంచి అటవీ శాఖ కార్యాలయం ఎదుట నీటి పారుదల వైపు ఏర్పాటు చేసుకునేందుకు లాటరీ తీసి దుకాణాలను కేటాయించారు. వ్యాపారులు నిర్ణీత రుసుము చెల్లించి, నిబంధనల ప్రకారం టపాకాయలు విక్రయించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటేశివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు. అంతకుముందు లాటరీ విధానాన్ని, దుకాణాల కేటాయింపు తీరును డీఎస్పీ వెంకటొరెడ్డి పరిశీలించారు.


లాటరీ ద్వారా టపాకాయల దుకాణాలను కేటాయిస్తున్న కమిషనర్

పీఆర్సీని అమలు చేయాలి : ఎస్టీయూ

నారాయణఖేడ్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు పెన్షన్ ప్రయోజనాలను చెల్లిస్తూ పీఆర్సీని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌సాబేర్ అలీ డిమాండ్ చేశారు. మంగళవారం ఖేడ్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ విశ్రాంత ఉపాధ్యాయులకు పెన్షన్ ప్రయోజనాలు అందక అప్పులను తీర్చలేక, కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సాధిస్తే ఎంఈవో, జేఎల్, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులకు మార్గం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవన్‌రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు కాశీరాంజాదవ్, జిల్లా, స్థానిక బాధ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

హవేళిఘణపూర్/వెల్దుర్తి/మాసాయిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తహసీల్దార్ సింధురేణుక, ప్యాక్స్ చైర్మన్ హనుమంతరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సాధారణరకం రూ.2,378 కాగా, ఏ గ్రేడ్ రకానికి రూ.2,398 ధర అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో బాల్‌రెడ్డి, ఏఈవో ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే వెల్దుర్తి మండలం బండపోసన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ బాలలక్ష్మి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి ప్రారంభించారు. మాసాయిపేట మండలంలోని అచ్చంపేట, మాసాయిపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ జ్ఞానజ్యోతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరసింహులు, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఆర్ఐ ధన్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తూ.. అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌పై కొందరు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొందరు యూట్యూబర్లు డబ్బు సంపాదనే ముఖ్యంగా ఏదిపడితే అది మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడి కార్యకర్తలు, అభిమానుల ఆగ్రహానికి గురికావద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, కంది, సంగారెడ్డి, కొండాపూర్ మండలాల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, చక్రపాణి, మ్యాకం విఠల్, సలావుద్దీన్, అజయ్, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

తండాలకు తాగునీరు అందించేందుకు చర్యలు


వెలిమెలతండాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాములుగౌడ్

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తండాలకు తాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాలగోని రాములుగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వెలిమెల తాండాలో బోరు వేసి వచ్చిన నీటిని ప్రారంభించారు. అలానే మేఫేర్ అనే సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద అందజేసిన మొక్కలను తాండాలో ఇంటింటికి నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాండాలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాలగోని సాయిచరణ్‌గౌడ్, మేఫేర్ సంస్థ ప్రతినిధి రామ్‌నాయక్, హన్యానాయక్, మిత్యానాయక్, జైపాల్‌నాయక్, విఠల్‌నాయక్, జగన్‌నాయక్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు పెట్టొద్దు

నిజాంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలని బీజేపీ మండల సీనియర్ నాయకుడు కలుచ్చుగారి రాజిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రైతు సమస్యలపై అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ధాన్యం సేకరణలో లోటుపాట్లు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు మించి తూకం వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం డబ్బులను రైతుల ఖాతాలో జమచేయాలన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజిరెడ్డి

ఇంటి స్థలాలు ఇప్పించి న్యాయం చేయండి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిరుపేదలమైన తమకు ఇచ్చిన ఇంటి స్థలాలను ఆక్రమించుకునేందుకు తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు వాపోయారు. ఈ మేరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం డీఆర్‌వో పద్మజారాణికి భూ బాధితులు ఫిర్యాదు చేసి మాట్లాడారు. జహీరాబాద్ మున్సిపాలిటీలో 1982లో అప్పటి ప్రభుత్వం నిరుపేదలమైన తమకు సర్వే నెంబర్లు 163, 166, 167, 168, 160, 161లో 109-11 ఎకరాల్లో తమకు ప్లాట్లు చేసి ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇది తమ భూమి అంటూ ప్లాట్లలోకి కొందరు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు.



కుటుంబసభ్యులే.. సహాయకులు!

సదరం క్యాంపులో దివ్యాంగులకు తిప్పలు తప్పలేదు. ఆస్పత్రి పేషెంట్ కేర్‌లు(సహాయకులు) సకాలంలో అందుబాటులో లేకపోవడంతో క్యాంపునకు వచ్చిన దివ్యాంగులకు కుటుంబసభ్యులే పేషెంట్ కేర్ అవతారమెత్తాల్సి వచ్చింది. దివ్యాంగుడిని లోనికి ఎత్తుకొని వెళ్లడంతో పాటు వీల్‌చైర్‌ను తోసుకుంటూ కుటుంబసభ్యులే క్యాంపు వద్దకు తీసుకెళ్లడం గమనార్హం.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్(ఆంధ్రజ్యోతి), సంగారెడ్డి జిల్లా



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్వాతి

చేగుంట/పాపన్నపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చేగుంట మండలం చందాయిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కేతావత్ స్వాతి ఎంపికైంది. ఈనెల 12న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-14 కబడ్డీ విభాగంలో ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. చేగుంట మండలం నుంచి ఒక్కరే ఎంపికకావడం పట్ల ప్రధానోపాధ్యాయుడు కిషన్, వ్యాయామ ఉపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు స్వాతిని అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అశ్రుత, 9వ తరగతి చదువుతున్న నర్సింహులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం మహేశ్వర్, టీచర్లు అభినందించారు.


కేతావత్ స్వాతి